


# తమసోమా

సరిగ్గా అనుకున్న టైముకు ఇంటిముందు కారొచ్చి ఆగింది. ముందు బావా అక్కయ్యా దిగేరు. తర్వాత రవీ అతని శ్రీమతి వాణీ ది రవీ మా బావా చిన్నప్పట్నించీ సహాధ్యాయులు, స్నేహితులూను. బావ ఇంత పెద్ద 'పొజిషన్' లో వుండటానికి కారణం రవి సహాయమే మాటలసందర్భంలో చాలాసార్లు విన్నాను. వాళ్ళని చూడటం ఇదే మె సారి. అయితే పత్రికల్లో రెండుమూడుసార్లు వాళ్ళ ఫొటోలు చూ

మా బావ పరిచయం చేస్తూండగా, వాళ్ళకి నమస్కరించే ప్రయత్న ఆ యిద్దరి నిండైన విగ్రహాల్ని తనివితీరా చూశాను. చక్కని జంట. ముప్ఫయ్యేళ్ళుంటాయి. మంచి వొడ్డూ పొడుగూ, రంగుతో ఆ దుస్తుల్లో 'టినోపాల్' ఎడ్వర్టయిజ్ మెంట్ బొమ్మలాగున్నాడు. లేత పచ్చ రంగు షెరీకాట్ చీర, ముదురు ఆకుపచ్చ రంగులో 'రౌండ్ లోకట్ స్లీవ్ లెస్ బ్లౌజూ' వేసుకుంది వాణి. మెళ్ళో వొంటిపేట బం గొలుసు శరీరం రంగులో కలిసిపోయి వొంపులు వొంపులుగా జాలు టప్పుడు చీరచాటున మెరుస్తూ కనబడుతుంది. నిండయిన గుండ్రని మొ నాజూకైనవొంపులూ ఆమెలో కొట్టొచ్చినట్టు కనబడతాయి.

"మీరు రాసిన గేయాలంటే మావాణి చెవికోసుకుంటుంది."అన్నాడ

"కోసుకోడం ఎందుకూ! వింటానంటే వాణిచెవిన యిల్లుకట్టుకు వినిపిస్తుంది" అన్నాడు మా బావ.

"గేయాలేనా కథలు కూడా రాస్తారా?" అడిగేడు రవి.

"పలు విధంబులైన గేయంబులతో సాహితీ సతిని గాయపరచి, క వధించి .." అంటూ మా బావ చదువుతున్న దండకం "స్వామీ! షటపి శాంతించుడు" అన్న మా అక్కయ్య ఆదేశంతో ఆగింది.

కారు లేటెస్ట్ మోడల్ షెవ్. ఎయిర్ కండిషనర్, రేడి ఆలివ్ గ్రీన్ షేడ్ లో అద్దాలూ, వెల్ వెట్ కుషన్లతో, సీట్లతో రవి దర్జాకి తగ్గట్టుంది. రవే డ్రైవ్ చేస్తున్నాడు. ముందు సీట్లో రవీ మా వున్నారు. వెనక సీట్లో వాణీ మా అక్కయ్యా కూర్చున్నారు. ట్రావెల్ కిట్ కూడా డిక్కీలో పడేసిముందుసీట్లో ఎక్కబోత "నీ కథా కాలక్షేపం వుంది కనక నువ్వు సాధ్యమైనంత వాణిచెవికి గానూ, మా చెవులకి దూరంగానూ వుండటం అవసరం," అని బావ అనగానే వెనకసీట్లో, మా అక్కయ్య పక్కన కూర్చు

బి. వి. రమణరావు

ఈ ప్రయాణంకోసం పదిరోజులుగా ఎదురుచూస్తున్నాను. ఈ అవకాశంతో రవి పరిచయం అయితే అది స్నేహంగా మారి ఆయన పలుకుబడితో ఏదైనా పెద్ద కంపెనీలో, ఇప్పుడు నేను చేస్తున్న దానికంటే పెద్ద ఉద్యోగ మేదైనా దొరికితే, దానితో నేనుకూడా బావలాగ పైకొస్తే మురిసిపోదామన్న సత్సంకల్పంతో మా అక్కయ్య యిచ్చిన ప్రోద్బలంకూడా నేను బయలుదేరడానికి కారణం కాకపోలేదు. అయితే ఇంత తీరుబడిగా సుఖంగా కార్లో తిరుపతి వెళ్ళే అనుభవాన్ని ఆశించడం ముఖ్యమైన కారణం.

అడుగడుగునా, కూడా తెచ్చిన ఫలహారాదులు సేవిస్తూ కబుర్లు చెప్పుకుంటుంటే గంటలు నిమిషాల్లాగ దొర్లిపోతున్నాయి. సంభాషణల్లో చాలా తక్కువ పాల్గొనేది రవి ఒక్కడే. మొదట్లో డ్రైవింగ్ చేసే ఏకాగ్రతేమో ననుకున్నాను. మధ్య మధ్య అతను వేసే ప్రశ్నలనుబట్టి అతనో నిండుకుండనే నిర్ణయానికొచ్చేను. వాణి మొదట్నుంచీ బొమ్మలకి 'కీ' యిచ్చినట్టుగా ఏదో అంశం తీసుకొచ్చి చర్చలోకి దింపడం, తను చల్లగా తప్పుకుని వాదోపవాదాలు వింటూ ఆనందించడం గమనిస్తూనే వున్నాను. మా అక్కయ్య మాటలకి యతంటే ప్రతనడం మా బావకి సరదా. ప్రేమ విరహాల దగ్గర్నుంచి రాజకీయ హత్యలవరకూ పొద్దుట్నుంచీ సాయంత్రందాకా తర్కంలో మథించగా ఉద్భవించిన హాలాహలం తల నెప్పి, కాస్సేపు కారు దిగి పెన్నానది వొడ్డున కూర్చుందాం అన్న రవి ప్రతిపాదన అమృతం.

నెల్లూరునుంచి అసలు రోడ్ తప్పించి నాలుగుమైళ్లొచ్చాం. దట్టమైన 'నౌలాక్ గార్డెన్స్' దగ్గిర కారాగింది. ఫ్లాస్కు, క్యారియరూ ప్లాస్టిక్ బుట్టా జంపకానాలూ తీసుకుని రెండు ఫర్లాంగులు నడిచేం. అక్కడ పెన్నానది అర్ధచంద్రాకృతిలో వంపుతిరిగి వుంది. తోటకి దిగువగా జంపకానాలు పరిచేం. కాళ్ళూ చేతులూ మొహం కడుక్కుని అక్కడ చతికిల పడేటప్పటికి ప్రాణం లేచొచ్చింది. మా బావ బుట్టలోంచి బాటిల్స్ బయటికి తీస్తుంటే "కవిగారు సురాపానం చేస్తారా లేకపోతే యింకా అసురులేనా?" అన్నాడు రవి.

"రోజూ గీతాపారాయణం చేస్తాడు," అన్నాడు మా బావ.

"అదిమాత్రం అందరికీ చేత నవ్వొద్దూ!" అంది అక్కయ్య.

"పారాయణం ఏంలాభం–ఆచరణలో పెట్టాలికాని!" అని సాగదీశాడు మా బావ.

"మీరు పెడుతున్నారుగా!"

"ఆహా! 'సర్వధర్మాన్ పరిత్యజ్య' వరకూ వొచ్చేను" అన్నాడు మా బావ. అందరూ నవ్వుకున్నారు. తర్వాత "వైస్కు లెవరో చేతు లెత్తండి" అన్నాడు. రవీ, వాణీ మా అక్కయ్యా చేతు లెత్తేరు వాళ్ళ గ్లాసుల్లో విస్కీ పోశాడు. తను మాత్రం జైనుడే అంటూ తన గ్లాసులో 'జిన్' పోసుకున్నాడు. వాణి ఫ్లాస్కులోంచి ఐస్ క్యూబ్స్ తీసి అందరి గ్లాసుల్లో వేసి నాకు మాత్రం లెమన్ కార్డియల్ లో ఐస్ వాటర్ కలిపి ఇచ్చింది.

నా గ్లాస్ తీసుకుని తాగేసి జంపకానా మీద నడుం వాల్చి ఆ ప్రశాంత ప్రకృతి చల్లని కౌగిలిలోకి జారేను. మెలకువ వొచ్చి వాచి కేసి చూస్తే అంకెలు కనబడలేదు. ఎదురుకుండా పెన్నానది కవతల మామిడితోటల వెనకాలనుంచి సూర్యుడు కొండ దిగి వెళ్ళిపోయినట్టు సింధూర వర్ణంలో ఆకాశం అంచున జాడ మాత్రం కనబడింది.

దూరంగా ఇసుకలో నెమ్మదిగా అడుగు లేసుకుంటూ రవీ, వాణి, మా అక్కయ్యా, బావా గొలుసులాగ చేతులు కలుపుకుని కబుర్లు చెప్పుకుంటూ తిరిగొస్తున్నారు.

ఆ దంపతుల జంటకేసి చూస్తుంటే వాళ్ళ జీవితమే ఆనందానికి నిర్వచనమేమో అనిపించింది. అందం, ఆరోగ్యం, ఐశ్వర్యం, చదువూ, సంస్కారం, సంఘంలో గౌరవం ఇంతకంటే ఎవళ్లు మాత్రం ఏం కోరుకుంటారు! ఈ నా ఆలోచనలో అజ్ఞాతంగా అసూయకూడా మిళితమైనట్టు తోచి, ఎప్పటికీ వాళ్ళపట్ల అలాంటి ద్వేష భావం కలగకూడదనీ, వాళ్ళ జీవితం మరింత ఆనందమయం అవ్వాలనీ భగవంతుణ్ణి ప్రార్థించేను.

వారు బయలుదేరినతర్వాత "సూర్యాస్తమయం చూస్తుంటే ఆ ఆనంద తన్మయత్వంలో టైము తెలియలేదు," అంది వాణి.

"అది సూర్యుడి ప్రభావం కాదు. మనం సేవించిన అమృతం స్వభావం," అన్నాడు మా బావ.

"ఇంకో గంటిక్కడే కూర్చుంటే అదీ విసుగెత్తుతుంది. ఇంట్లో కూర్చుంటే క్లబ్బుకు పోబుద్ధవుతుంది. క్లబ్ కి వెళ్ళిన తర్వాత త్వరగా యింటికొచ్చెయ్యబుద్ధేస్తుంది. ఏమిటో! మన కేంకావాలో మనకే తెలీదు," అంది మా అక్కయ్య వేదాంత ధోరణిలో.

'మానవ చరిత్రంతా ఆనందాన్వేషణలో మానవుడు జరుపుతున్న ఒక అనంత ప్రయోగం ... ఏమంటారు కవిగారు?" అంటూ నన్ను పలకరించేడు రవి.

"జీవితంలో ఆనంద మనేది మనిషికొక దూరపుకొండ. ఏది ఆనందదాయక మనుకుంటాడో అది దొరికిన తర్వాత మోజు తగ్గగానే కొత్తదానికోసం చేతులు జాచుతాడు. సైన్సును నమ్ముకుని భూతల స్వర్గం సృష్టిస్తానంటూ ఈ అధునాతన నాగరికప్రపంచాన్ని సృష్టించేడు. దీన్ని ఆవరించివున్న అసంతృప్తీ, అసూయా, అహంకారం లాంటి మంటల్ని ఆర్పలేక, ఆ వేడి కోర్చుకోలేక మళ్ళీ రాతియుగం నాటి స్వేచ్ఛకోసం లొట్టలువేస్తున్నా."



న్నాను, నా మాటలకి నేనే మురిసి
పోతూ.

"ఓ భావయోగీ! గిరగిర తిరిగే భూమ్మీద నిలబడ్డ మనం మాత్రం నిలకడగా వుండగలమా! ముందుకో వెనక్కో మార్పు కోరడం సహజం. మార్పు వలన ఆనందం రాకపోయినా, మార్పే ఓ ఆనందం," అన్నాడు మా బావ తన వాడివాదన ధోరణిలో.

నిజానికి మా బావ నాస్తికుడనే చెప్పాలి. కాని రవి ధోరణిలో ఏదో ఓ తీక్షణమైన జిజ్ఞాస వుంది. ఏ వొక్కమాటా అనాలోచితంగా అంటున్నట్టు తోచదు. అందరిమధ్యా అందరికంటే ఉత్సాహంగా వున్నా, మధ్యమధ్య తనలోకితను ముడుచుకుపోయినట్టు కనబడతాడు.

తిరుపతి సమీపించేటప్పటికి మా సంభాషణ పునర్జన్మ, పూర్వజన్మ స్మృతుల మీదికి దొర్లింది. ప్రఖ్యాత మానసిక తత్వవేత్త డాక్టర్ బెనర్జి దేశదేశాలనుంచి సేకరించిన అంశాలూ, చేసిన పరిశోధనలూ, ఆధ్యాత్మిక దృష్ట్యా వాటి సమన్వయం – తీవ్రమైన వాదోపవాదాలకి దారితీశాయి. అంతవరకూ నిశ్శబ్దంగా వున్న రవి "ఆల్ రైట్ మిస్టర్ కవీ! చావుబతుకులు మన చేతుల్లో లేవంటారు ..అవునా?" అన్నాడు. "అవును" అన్నాను. వెంటనే కారు స్పీడెక్కువ చేశాడు. కారు అప్పటికి ఘాట్ రోడ్ మధ్య నుంది. చూస్తుండగా కారు భయంకరమైన స్పీడ్ అందుకుంది. ప్రతిమలుపులోనూ కారు కీచుమని శబ్దం చేస్తుంటే గుండెలో దేవుతున్నట్టుంది. మా అక్కయ్య చేతి వేళ్లు నా చేతుల కండల్లో దిగేలాగ వచ్చి పట్టుకుంది. తర్వాత భయంతో తెలివి తప్పినట్టుంది– పట్టు సడలింది. మా బావ 'రవీ' అని గట్టిగా కేకేసి రవి కేసి జరగబోతే రవి తన బలమైన చేత్తో దూరంగా నెట్టివేశాడు. వాణి నిస్సహాయంగా సీటుకు జార్లాపడి కళ్ళు గట్టిగా మూసుకుంది. వచ్చే పోయే కార్లుకూడా మా కారు దాటిన తర్వాత ఒక్క క్షణం ఆగి నిర్ఘాంతపోతున్నాయి.

ప్రతి మలుపూ ఒక మరణం దాటడమో– పునర్జన్మగా అడుగడుగునా ఆశానిరాశల మధ్య ప్రాణాలు గిజగిజ తన్నుకుంటుండగా; పళ్ళు బిగించి కళ్లు మూసుకున్నాను. మనస్సు 'అన్యథా శరణం నాస్తి...' అని ఎలిగెత్తి భగవంతుణ్ని ప్రార్థిస్తూండగా అనంతం అనిపించిన ఘాట్ రోడ్ కొన్ని యుగాల్లాంటి నిమిషాల తర్వాత చదునైన రోడ్‌గా మారడం గమనించి నెమ్మదిగా కళ్ళు తెరిచాను. దూరంగా జ్యోతిర్మయమైన వెంకటేశ్వరస్వామి ఆలయగోపురం అభయహస్తంలాగ కనబడింది.

* * *

నెల తిరగకుండా రెట్టింపు జీతంమీద వాళ్ళ కంపెనీలోనే రవి నాకు ఉద్యోగం వేయించేడు. సంవత్సరం తిరక్కుండా ప్రమోషన్ వచ్చింది. మరో యేడాదిలో కొత్త ఫ్యాక్టరీకి ప్రొడక్షన్ చీఫ్ నయ్యేను. నా అదృష్టాన్ని నేనే నమ్మలేకపోయాను. ఇంటి కెడితే రవి నన్ను స్వంత తమ్ముడిలాగ ఆదరించేవాడు. రవి వాణీకూడా నన్ను కవి అనే పిలిచేవాళ్ళు. సాయంత్రం ఎప్పుడైనా వాళ్ళింటికి వెడితే రాత్రి భోజనం చెయ్యందే వెళ్ళనిచ్చేవాళ్ళు కాదు.

నేను ఈ కంపెనీలో చేరిన తర్వాత అది మూడో పుట్టినరోజు పండగ. ఆ సాయంత్రం వాళ్ళింట్లోనే పార్టీ ఏర్పాటు చేసింది వాణి. తప్పనిసరి అవసరంవల్ల రవి క్లబ్‌లో డిన్నర్ పార్టీ కెళ్ళవల్సివొచ్చింది. వాణికి బ్రాందీ విస్కీలకంటే 'షాంపెయిన్' అంటే ఎక్కువ యిష్టం. ఆ సాయంత్రం రెండు బాటిల్స్ తీసుకని వెళ్ళేను. నా కిష్టమైన విస్కీ తెప్పించి వుంచింది వాణి. ఖరీదయిన కెమెరా రవి తరఫున బహుమానంగా యిచ్చింది. నిజానికి ఆ పార్టీకి వాణికూడా వెళ్ళవల్సిందే. నేను చిన్నబుచ్చుకోకుండా వాణి ఇంట్లో వుండిపోయింది

చాలాసేపు డ్రింక్స్ తీసుకుంటూ కూర్చున్నాము. రవీ వాణీ ప్రేమించుకోడం పెళ్ళిచేసుకోడం గురించి రకరకాల కథలు చెబుతూవుంటారు. అదే సదవకాశం అని ఆ ప్రస్తావన చేశాను.

"మీ అక్కయ్యా బావా చెప్పలేదా?" అడిగింది.

"లేదు," అని అబద్ధమాడేను. వాణి నమ్మలేదని ఆమె కళ్ళే చెప్పేయి.

"నేను ఎమ్మే చదువుతున్న రోజులవి. మా నాన్నగారు బ్రిగేడియర్ మధుసూన్ అని రిటైర్డ్ ఆర్మీ ఆఫీసరు. ఆయనతో అప్పుడప్పుడు క్లబ్బుకీ, పార్టీలకీ వెళ్లేదాన్ని. నాలుగైదుసార్లు అలాంటి పార్టీలలోనే రవిని కలుసుకున్నాను. మా నాన్నగారికీ, రవితండ్రికీ స్నేహం వుండేదట. అంచేత రవికి మా నాన్నగారంటే ప్రత్యేకమైన గౌరవం వుండేది. అలా వుండగా, మా నాన్నగారికి కారు ఏక్సిడెంట్‌లో తలకి తీవ్రమైన దెబ్బలు తగిలేయి. మొదట జ్ఞాపకశక్తి తగ్గింది; తర్వాత మతిస్థిమితం దెబ్బతింది. ఆ రోజుల్లో డాక్టర్ రామ్‌శరణ్ అని మంచి పేరున్న సైకియాట్రిస్ట్: ఆయన క్లినిక్‌లో చేర్చాం. అక్కడికి రోజూ వొస్తూపోతూ వుండేదాన్ని.

"ఓ సాయంత్రం మా నాన్నగారున్న పక్కగదిలోనే రవిని వాళ్ళ డైరెక్టర్లు తీసుకొచ్చి చేర్పించారు. సంగతేమిటని డాక్టర్నడిగేను. గత వారంరోజుల్లోనూ రెండుసార్లు ఆత్మహత్యా ప్రయత్నం చేసుకున్నాడనీ, అంచేత "మైపోకోండ్రియా" యేమోనని అనుమానంగా వుందనీ, ఓ నెల్లాళ్ళయినా అతనక్కడ వుండటం అవసరమనీ అన్నాడు. మర్నాడు సాహసించి అతని గదిలోకి వెళ్లేను. చాలా సరదాగా మాట్లాడేడు.

అతనిలో ఎక్కడా శారీరకంగా కాని, మానసికంగా కాని రోగం వున్న చిహ్నాలేమీ కనబడలేదు. ఆ రోజు మొదలుకుని రోజూ ఓ గంటసేపు కబుర్లు చెప్పుకునే వాళ్ళం. మా నాన్నగారి విషయంలో ఎంతో సానుభూతి కనబరిచేడు.

"తను చేసింది ఆత్మహత్యా ప్రయత్నాలు కావనీ, చావంటే తనకి భయం వుండకూడదనే వుద్దేశ్యంతో చేసిన ప్రయోగాలనీ తను చావనని తనకి నమ్మక ముండబట్టే అలాంటి సాహసాలు చేశాననీ చెప్పేడు. అతని మాటల్లో పిరికితనం కాని విచారం కాని ఏ కోశానా లేవు. తర్వాత అతన్ని గురించి చాలా వివరాలు తెలుసుకున్నాను. అతని తల్లితండ్రులు అతని పసివాడి యేటనే పోయారు. పబ్లిక్ స్కూల్లో పెరిగేడు. చదువు ఐన తర్వాత తండ్రి స్థానే డైరెక్టరూ, అటుపైన తన తెలివితేటలతో మేనేజింగ్ డైరెక్టరూ అయ్యాడట. పెళ్ళాడమనీ, అలా వంటరి జీవితం శ్రేయస్కరం కాదనీ తోడి డైరెక్టర్లు ఎంత చెప్పినా వినలేదుట. ఆజన్మాంతరం బ్రహ్మచారిగా వుండిపోతాననీ, ఏ బంధనాలూ లేకుండా స్వతంత్రుడిగా వుండి తన జీవితాని కో లక్ష్యం ఏర్పరుచుకుని దాని సాధనకే తన జీవితాన్నంకితం చేస్తాననీ అంటాడుట.

"నెల్లాళ్ళ తర్వాత రవి హాస్పిటల్ విడిచిపెట్టినా మా యోగక్షేమాలు కనుక్కోడానికి తరచు వచ్చేవాడు. వచ్చినప్పుడల్లా చాలాసేపు కూర్చుని నాకు ఉత్సాహమైన కబుర్లు చెప్పేవాడు. నాలుగు నెలల తర్వాత మా నాన్నగారు



పోయారు. ఆ సమయంలో రవి చూపెట్టిన ఔదార్యం, చేసిన సహాయం ఇంతాఅంతా కాదు. అప్పటికే వూళ్ళో మమ్మల్ని గురించి గుసగుసలు ప్రారంభించేరు. ఈ విషయం రవిదగ్గర అన్నాను. 'లోకులు కాకులు, వాళ్ళ వాగుడుతో మనకి సంబంధం లేదు," అన్నాడు అంది వాణి.

"అంతే కాని 'పోనీ మనం పెళ్ళి చేసుకుందాం' అనలేదన్నమాట!" అన్నాను.

"అప్పు డనలేదు – సరికదా మరో నాలుగు నెలలకికూడా అనలేదు. చివరికి సిగ్గువిడిచి నేనే అడిగాను.

" 'నాకు పెళ్ళాడాలన్న వుద్దేశ్యం ఇంత వరకూ కలగలేదు. అయితే నువ్వు సుఖ పడతావన్న నమ్మక ముంటే నా కభ్యంతరం లేదు' అన్నాడు. ఆ తర్వాత రెండు నెలలకి మా పెళ్ళయింది," అంది వాణి.

మాటల సందర్భంలో నా పెళ్ళిమాట ఎత్తింది వాణి. ఇప్పట్లో నా కా వుద్దేశం లేదన్నాను. నిజానికి పెళ్ళాడితే వాణి లాంటి అందమైనదీ, చదువుకున్నదీ, తెలివైందీ, చురుకైన అమ్మాయినే పెళ్ళాడాలని నా సంకల్పం. ఆ అన్వేషణలో ఎన్నాళ్ళు పట్టినాసరే!

* * *

రవి మరణించేడన్న దుర్వార్త ట్రంక్ కాల్‌లో నేనే అందుకున్నాను. డైరెక్టర్ల మీటింగ్ సందర్భంలో, వారం రోజులైంది రవి బొంబాయి వెళ్ళి. క్రితం సాయంత్రం జుహూబీచ్‌కి వెళ్ళేడట. స్విమ్మింగ్ ట్రంక్ వేసుకుని సముద్రంలోకి దిగేడుట. రాత్రి ఎనిమిది గంటలకి డిన్నరుండగా ఎనిమిది దాటినా రాకపోవడం చూసి డ్రైవరొచ్చి చూస్తే రవి తెచ్చుకున్న షేడ్ కింద అతను వేసుకున్న దుస్తులున్నాయి కాని సముద్రంలో కనుచూపు మేర మనిషిజాడ లేదుట. పరుగెత్తుకెళ్ళి మిగిలిన డైరెక్టర్లకు టెలిఫోన్ చేస్తే తొమ్మిదింటికల్లా వొచ్చి సెర్చిలైట్లతో బీచ్ అంతా గాలించేరుట. రవి జాడ లేదుట.

ఆఫీసు ఫ్యాక్టరీ మూయించెయ్యమని మేనేజరుకి చెప్పి వాణిని తీసుకుని ప్లేన్‌లో బొంబాయి వెళ్ళేను. బొంబాయినుంచి తిరిగి వొచ్చేక రవి ప్రమాదవశాత్తూ మరణించలేదనీ, అది ఆత్మహత్య అన్న భయంకర సత్యాన్ని తెలుసుకున్నాం. రవి స్వదస్తూరితో రాసిన విల్లూ, కాపీలూ వాణికీ, నాకూ, కంపెనీకీ, ఎడ్వకేట్‌కీ అందేయి. తన యావదాస్తి రకరకాల ధర్మకార్యాల నిమిత్తం రాసేశాడు. మూడు లక్షల ఆస్తి వాణిపేర, రెండు లక్షల విలువ చేసే కంపెనీషేర్లు నా పేర రాశాడు. ఆత్మహత్యకి కారణాలు రాయకపోడం వాణికి ఆశ్చర్యం కలిగించలేదు.

రవి పోయిన తర్వాత ఇంచుమించు రోజూ వాణిని చూడ్డానికి వెళ్ళేవాణ్ణి. వాణి ఆస్తిపాస్తుల బాధ్యతకూడా నా మీదే పెట్టింది.

ఓ సాయంత్రం, మాటలసందర్భంలో రవిని గురించి "రవిది చాలా విచిత్రమైన మనస్తత్వం. మరో యేభై సంవత్సరాలు బతికున్నా రవిని నేను పూర్తిగా అర్థం చేసుకోలేను. తామరాకుమీది నీళ్ళలాగ దేన్నీ పట్టించుకోకుండా జీవించేవాడు. అతనికి కోరికలు లేవు. అందరి సంతోషం పంచుకోడమే అతని సంతోషం. రవి బట్టలుకూడా నేనే సెలెక్ట్ చేసేదాన్ని. మేమిచ్చే పార్టీలూ, పాల్గొన్న వినోదాలూ, ఇంట్లో అలంకరణలూ, కొన్న వస్తువులూ, చేసే ఖర్చూ – అంతా నా అభిరుచి ప్రకారమే జరిగేది. ఇది బాగుంది అది బాగాలేదు అని రవి ఎన్నడూ అనలేదు. కాని ఇలా పైకి కనబడే ఈ నిర్లక్ష్యమైన జీవితం వెనకాల ఏవో తీవ్రమైన ఆలోచనలతో కూడుకున్న మరో జీవితం వుండేది. ఆ అంతర్వాహిని ఫలితమే అతనిలో అశాంతి ఒక్కొక్కప్పుడు గంటల తరబడీ పరధ్యానంలో వుండేవాడు. ఒక్కొక్కరాత్రి తెల్లవార్లూ గదిలో లైటు వేసుకుని పచార్లు చేస్తూవుండేవాడు. ఒక్కొక్కప్పుడు ప్రాణాలకి లెక్కచెయ్యకుండా భయంకరంగా ప్రవర్తించేవాడు," అంది వాణి.

"అవును; నాకు తిరుపతి ప్రయాణం జ్ఞాపకముంది" అన్నాను.

"అలాంటి వెన్నో! రెండు నెలలకి చచ్చిపోతాడనగా ఒక సంఘటన జరిగింది. రవీ నేనూ కింద వరండామీద కూర్చున్నాం. ఓ పాములవాడు నాగస్వరం పాడుతూ పాములన్నీ చూపెడుతూ, కొత్తగాపట్టిన తాచుపామును పైకి తీసి, మా దగ్గరకి తీసుకొచ్చి దాని కింకా కోరలు పీకలేదని చెప్పేడు. అంత ధైర్యంగా ఎలా పట్టుకున్నావని అడిగితే, తనదగ్గిర తెల్ల ఈశ్వరవేర్లూ, నాగమణీ వున్నాయనీ [illegible] చదివి లేదనీ, పా[illegible] పూర్త[illegible] నిమిషాలమీ[illegible] అన్నాడు. అనడమే తడవు[illegible] పాముపడగ పట్టుకోడం, పాము కాటెయ్యడం క్షణంలో నా కళ్ళముందు జరిగిపోయింది. పాములవాడుకూడా బిత్తరపోయాడు. చూస్తుండగా రవి బాధతో మెలికలు తిరిగిపోతూ నోట మ్మట నురగలు కక్కుకోడం మొదలెట్టేడు. తోటమాలీ వాళ్ళూ రవిని పట్టుకున్నారు. నేను పరిగెత్తి డాక్టర్‌కి టెలిఫోన్ చేశాను. డాక్టరొచ్చేలోగా వాడి మూలికావైద్యంతో టే తేరుకున్నాడు."

"ఎందు కలా చేశావంటే ఏమంటాడు?" అడిగేను.

" 'కేవలం ఆహారం నిద్రా వినోదాల కోసమే నేను పుట్టినట్టయితే అవన్నీ అనుభవించేశాను. ఇంక చావడం మంచిది. నా జీవితంలో నేను చెయ్యవలసిన


దేమైనా వుంటే భగవంతుడు నన్ను చావనివ్వడు. ఇప్పుడు బతికేను కనక నేను బతకడం అవసరమన్న మాట' అన్నాడు రవి," అంది వాణి.

* * *

వాణి మళ్ళీ మామూలు మనిషవ్వడానికి రెండేళ్ళు పట్టింది. తర్వాత మేము పెళ్ళిచేసుకోడానికి చేసుకున్న నిర్ణయం సహజమైన పరిణామంగా లోకం పరిగణించింది. మిత్రులందరూ మమ్మల్నభినందించేరు. నా నిర్ణయంలో త్యాగం లేకపోయినా నిరాశాపూరితమైన వాణి జీవితంలో సుఖశాంతుల్ని చిగురింపజేసే పరమార్థంకూడా వుండటం నన్నానంద పరవశుణ్ణి చేసింది. వాణీ నేనూ ఇంచుమించు ఒకే వయస్సువాళ్ళం. ఆమెకున్న వ్యక్తిత్వం జీవితానుభవం నాకు లేవు. పెళ్లికి ఒప్పుకోదేమోనని మొదట భయపడ్డాను. ముక్తసరిగా 'సరే' అంది.

ఆ రోజే మా పెళ్ళి. పెళ్ళిమాత్రం చాలా నిరాడంబరంగా జరగాలంది వాణి. అలాగే జరిగింది. అజ్ఞాతంగా నా మనస్సులో కళ్ళెం తెంచుకుని పరిగెత్తే కోరిక గమ్యాన్ని చేరిన శుభదినం అది. వేయి రతీ మన్మథుల నృత్యగానాల ప్రతిధ్వనితో ఆనాడు హృదయం స్పందించింది. ఆనంద శిఖరారోహణలో అది ఆఖరి మెట్టు.

ఆ రాత్రి ఏకాంతంలో ఆనందాశ్రువులు నిండిన కళ్ళతో మొహం దించుకుని ఎదురుగా నిలబడి "మీరు..." అంటూ ఏదో అనబోయింది వాణి. రెండు చేతుల్లోకి వాణి మొహం తీసుకుని పైకెత్తి సూటిగా కళ్ళల్లోకి చూస్తూ "ఇక మీదట 'మీరు' అని నన్ను సంబోధించడం మానేసి రవిని పిలిచినట్టుగానే పేరుపెట్టి పిలు" అన్నాను. ఆ క్షణంలో ఆమె మొహంలో ఒక భయంకరమైన మార్పు వచ్చింది. నా చేతులు తప్పించుకుని మొహం పక్కకి తిప్పుకని వెక్కి వెక్కి ఏడవడం మొదలెట్టింది. 'ఇలాంటి మధు




రాతి మధురక్షణంలో రవి ప్రసక్తి ఎందుకు తీసుకొచ్చేవు!' అని నా బుద్ధి నిలదీసి అడిగింది. 'కోరికల ఉద్వేగం' అంది మనస్సు 'దౌర్భాగ్యుడా! అనుభవించు' అంది అంతరాత్మ. దీనంగా, మౌనంగా తల దించుకున్నాను. తర్వాత మా యిద్దరిలో ఎవళ్ళం ఒక అడుగు వెనక్కి వేశామో తెలీదు. తలలు దించుకుని ఎడంగా నిలబడివున్నాం. ఆ క్షణంలో మా యిద్దరి మధ్యా అజ్ఞాతంగా రవి నిలబడి వికటాట్టహాసం చేస్తున్నాడేమో ననిపించింది. "నమాం దుష్కృతి నోమూఢాః ప్రపద్యన్తే నరాధమాః మాయయాఽపహృతజ్ఞానా అసురం భావ మాశ్రితాః" అన్న గీతా శ్లోకం జ్ఞాపకమొచ్చింది.

* * *

మా పెళ్ళయిన తర్వాత, ముఖ్యంగా మా అబ్బాయి పుట్టేక వాణి ప్రవర్తనలో విపరీతమైన మార్పొచ్చింది. క్లబ్ కి రావడము మానేసింది. డ్రింక్స్ వదిలిపెట్టేసింది. సరదాలూ వినోదాలూ అంటే విరక్తి. పూజా పునస్కారం, వేదాంతం అంటూ పెద్ద ముత్తయిదువు లాగ తయారయింది. ఈ పరివర్తన నాకో చిత్రవధయింది. ఒక పార్టీకి రాదు ఒక పిక్నిక్ కి రాదు. కనీసము ఇంట్లో ఐనా తన అందచందాలను గురించి శ్రద్ధ తీసుకోదు. ఇదంతా నా అసమర్థత అంటూ స్నేహితులు సూటిపోటి మాట లనడం మొదలెట్టేరు. ఈ విషయంలో మా మధ్య ఎన్నోసార్లు వివాదం జరిగింది. నా ప్రయత్నాలన్నీ నిష్ఫల మయ్యేయి.

పోనీ తనేమైనా ఇంట్లో సుఖపడుతుందా అంటే అదీ లేదు. అనవసరమైన ఆలోచనలతో బుర్ర పాడుచేసుకుని విపరీతమైన తలనొప్పితో బాధపడుతుంది. డజన్లకొద్దీ 'ట్రాంక్విలైజర్స్ టాబ్లెట్లు' మింగుతుంది రోజూ. చివరికి ఓ యాడాదిలో అవేవీ పనిచెయ్యడం మానేసేయి. మరీ బాధ భరించడం కష్టమైతే డాక్టర్ దగ్గిరికెళ్ళి ఓ 'మార్ఫియా ఇంజెక్షన్' తీసుకునేది. కొన్నాళ్ళకి 'మార్ఫియా ఇంజెక్షన్లు' తనకి తనే పొడుచుకోడం అలవాటు చేసుకుంది. చివరకి అది భయంకరమైన వ్యసనంగా తయారయింది. ఎన్నోసార్లు ఆ అలవాటు మానెయ్యమన్నాను, అలాగే అనేది. రహస్యంగా తీసుకునేది. గత్యంతరంలేక చూసీ చూడనట్టు ఊరుకునే వాణ్ణి.

ఆ రోజు మా ఫ్యాక్టరీ వార్షికోత్సవం బహుమతి ప్రదానానికి వాణిని రమ్మని ఉద్యోగస్థులొచ్చి కోరారు. రానంది. నా కోపాన్నెలాగో దిగమింగుకున్నాను. కనీసం రాత్రి డిన్నర్ కేనా తీసుకురమ్మని అందరూ అన్నారు. తప్పకుండా తీసుకొస్తానని వాగ్దానం చేశాను.

నయాన్నో భయాన్నో ఒప్పించి తీసుకొద్దామన్న ఉద్దేశంతో. రాత్రి ఎనిమిదింటికి యింటికొచ్చేను. మేడమీద హాల్లో కుర్రాణ్ణి సముదాయించి నిద్రపోగొట్టడానికి ఆయా సకల ప్రయత్నాలూ చేస్తోంది. వాణ్ణి పలకరించి సరాసరి వాణి గదిలో కొచ్చేను అప్పుడే మార్ఫిన్ ఇన్‌జెక్షన్ల పేకట్ విప్పుతోంది వేళాకోళంగా లాగినట్లు ఆ పేకట్ చేతులోంచి లాగేసేను. పెనగులాడింది. దాచేశాను. డిన్నర్‌కి తయారవ్వమన్నాను. ససేమి రానంది. చాలాసేపు బతిమాలేను. డిన్నర్ నుంచి తిరిగొచ్చిన తర్వాత యాంప్యూలు యిస్తానన్నాను. ఒప్పుకోలేదు.

"వాణీ! నీకోసమే చెబుతున్నాను. ఈ ఘోరమైన వ్యసనాన్నుంచి తప్పించుకో. లేకపోతే నిన్నిది పీల్చి పిప్పిచేసి జీవచ్ఛవంలా తయారుచేస్తుం," దన్నాను అనునయంగా.

"నెమ్మదిగా మానేస్తాను. ముందరో యాంప్యూల్ ఇయ్యి. ఒళ్ళంతా నరాలు తోడేస్తున్నయి ... నే నీ బాధ భరించలేను."

"ఒద్దు. నే నివ్వను. నాకోసమైనా నువ్వీ నరకంనుంచి బయిట పడాలి. లే. బట్టలు వేసుకో. మనకోసం అందరూ ఎదురుచూస్తూ వుంటారు."

"నేను రానని ఎన్నిసార్లు చెప్పమంటావు!"

"నువ్వొచ్చితీరాలి. బ్రహ్మాండమైన ఏర్పాట్లు చేశారు. ఊళ్ళో పెద్దవాళ్ళనందరినీ పిలిచేము."

"అవన్నీ నా కక్కర్లేదు. నాక్కావల్సిందో మార్ఫిన్ ఇంజెక్షన్. ఇలా ఇయ్యి. ఇంక వాదించకు, వాగించకు నా నవనాడులూ క్రుంగిపోతున్నాయి. త్వరగా ఇయ్యి"

"నువ్వేడ్చి మొత్తుకున్నా యివ్వను ఇంక నీ మూర్ఖత్వం కట్టిపెట్టు."

"ఇస్తావు. తప్పకుండా ఇస్తావు. నేను బాధపడటం నువ్వు సహించలేవు."

"ఇన్నాళ్ళూ సహించలేకపోయాను. ఇప్పుడు కాదు, నీ రోగం మితిమీరిపోయింది. నువ్వో గాజుబొమ్మలాగ యింట్లో పడుండటం నేను భరించలేను. నువ్వో బాధ్యతగల స్త్రీవి, గృహిణివి, తల్లివి, మరిచిపోకు. లే, బయలుదేరు "

"నా తరంకాదు."

"ఎందుక్కాదో చూస్తాను. నువ్వు ఇప్పుడు గిజగిజ తన్నుకు చచ్చినా యాంప్యూల్ ఇవ్వను."

"ఛీ! నువ్వు మనిషివి కాదు. పశువ్వి. నీకు హృదయం లేదు."

"వాణీ!" ఉద్రేకంతో కొట్టడానికి చెయ్యెత్తేను.

"ఏం! అభిమానం వొచ్చిందా! హుఁ ... విను ... నీ మొహం చూడలేక, నీ భార్యగా జీవించడమనే ఈ అవమానాన్ని భరించలేక ఈ మార్ఫిన్ దేవత నాశ్రయించేను."

"వాణీ!"

"నీ భగవద్గీతా, నీ వేదాంతం, నీ కవిత్వం అంతా వట్టి బూటకం. నీకు నిజంగా న్యాయంలోనూ ధర్మంలోనూ నమ్మకం లేదు. నీ క్కావల్సింది డబ్బు, అధికారం, పదవి, ప్రతిష్ఠ. వాటికోసం నువ్వేమైనా చేస్తావు."

"వాణీ! ప్లీజ్......!"

"దిక్కులేని కుక్కలాగున్న నిన్ను చేగదీసి ఉద్యోగ మిచ్చి పైకి తీసుకొచ్చిన ప్రాణస్నేహితుడి భార్యనే మోహించేవు. అతను చావగానే స్వర్గం నీ కోసమే ద్వారం తెరిచిం దనుకుని కామంతో కళ్ళు కప్పుకుపోయి కల్లిబొల్లి ఓదార్పులతో నన్ను మభ్యపెట్టి నన్ను పెళ్ళాడేవు. నీ నిజస్వరూపం తర్వాత తెలుసుకున్నాను. చావనేనా చస్తాను కాని నీకూడా రాను," అంది కళ్ళల్లో నిప్పులు కురిపిస్తూ.—

ఆ మార్ఫిన్ యాంప్యూల్ పేకట్ సోఫామీద పడేసి, 'భగవాన్! భగవాన్!' అంటూ నిస్సహాయంగా మంచంమీద చతికిలబడ్డాను—రెండు చేతుల్తోటీ మొహం కప్పుకొని. ఐదు నిమిషాల తర్వాత ఇంజెక్షన్ మైకం అందుకోగానే నెమ్మదిగా నా ప్రక్కన కూర్చుని వాణి తన తప్పులు క్షమించమనీ, ఇష్టమొచ్చిన శిక్ష విధించమనీ, తను ఉద్రేకంలో అన్న మాటలు నమ్మొద్దనీ, తను నన్ను మనసారా ప్రేమించిందనీ అంటూ నన్ను సముదాయించడానికి ప్రయత్నించింది. జుగుప్సతో విదిలించుకుని సోఫామీద కొచ్చి కూర్చున్నాను. తర్వాత ఐదు నిమిషాలు ఏడ్చి నిద్రపోయింది. నేను లేచి గదిబయిటికి పోబోతూ, మంచం దగ్గిరగా వొచ్చి పరీక్షగా వాణి మొహంలోకి చూశాను. పెదవుల మీద చిరునవ్వు తాండవమాడుతూండగా ప్రశాంతంగా వుంది. స్పృహలో వుండగా తిట్టిన తిట్లకంటే వెయ్యిరెట్లు ఆ మైకంలో చిరునవ్వు నా హృదయాన్ని దహించింది.

* * *

కాన్ఫరెన్స్‌కు బెనారెస్ వెళ్ళినప్పుడు అందరితోబాటూ నేనూ అక్కడికి ఎనిమిది మైళ్ళ దూరంలోవున్న సారనాథ్ వెళ్ళేను. అది పురాతనమైన బౌద్ధవిహారం. ఈనాడు మన జాతీయ చిహ్నమైన అశోక స్తంభం అక్కడున్న శిల్పాలనుంచి సేకరించినదే. ఉత్సాహంగా అక్కడ ఫొటోలు తీస్తున్నాను అక్కడ ప్రసిద్ధికెక్కిన బిర్లా మందిరంలోంచి కొందరు బౌద్ధభిక్షువులు బయిటికి రావడం చూసి కెమెరా అటు తిప్పి క్లిక్ చేసి త్రుళ్ళిపడి 'వ్యూఫైండర్' లోంచి పరీక్షగా చూశాను. వాళ్ళందరూ నున్నని గుండ్లుతోటి, కాషాయవస్త్రాల తోటీ ఒకలాగే వున్నారు. కాని ఆ నడకలో ఆ ఠీవీ, బంగారుఛాయా, ఆజానుబాహు శరీరం చూడగానే వాళ్ళల్లో రవిని ఆనవాలుపట్టేను. ఒక్కక్షణం కొయ్యబారిపోయి నిలబడ్డాను. తర్వాత దూరంగా నడుస్తూ వెంబడించేను.

గోడల మీదా, అడుగడుగునా స్తంభాలమీదా బుద్ధుడి జీవితచరిత్ర,

నిర్మాణం ప్రతిబింబించే శిల్పాలతో పెద్ద ప్రదర్శనశాల లాంటి పురాతన మండపం దగ్గిర కొచ్చేను అక్కడ భిక్షువులు నిశ్శబ్దంగా చదువుకునేవాళ్లు చదువుకుంటున్నారు. కొందరు నడుం వాల్చి విశ్రాంతి తీసుకుంటున్నారు. మరికొందరు పద్మాసనంమీద ధ్యానం చేసుకుంటున్నారు. మండపంబయట చెట్లతోపులలో కొందరు భిక్షువులు వేదాంత చర్చలలోలాగుంది– నిమగ్నులై వున్నారు. వాళ్ళల్లో భారతీయులే కాకుండా ప్రాచ్య, పాశ్చాత్య దేశాల వాళ్లు కూడా వున్నారు.

ఒక భిక్షువు ముందు నడుస్తూ దారి చూపెడతూ వుంటే, ఆ మండపం దాటి దాని వెనకాల వరసగా వున్న గదుల ముందునుంచి వెడుతున్నాను. ఒక గది ముందు ఆగి, నిశ్శబ్దంగా లోపలికెళ్ళమని చెప్పి అతను వెళ్ళిపోయాడు. పిల్లిలాగ అడుగు లేసుకుంటూ గదిలో కెళ్ళేను. అక్కడ చాపమీద పడుకునివున్న మరో భిక్షువు పాదాలు వొత్తుతూ పక్కనే కూర్చున్నాడు రవి. ఏదో ఆనంద తన్మయత్వంలో తనలో తనే చిరునవ్వు నవ్వుకుంటున్నాడు. రవి శరీరంకేసి పరీక్షగా చూశాను. ఆరోగ్యంతో మెరుస్తూంది. అతని మొహంలో కనబడ్డ ఆ మందహాస రేఖలతోనే శరీరమంతా కప్పుకున్నాడా అనిపించింది. ఆ భిక్షువుకి నిద్రపట్టినట్టుంది. మూలుగు ఆగిపోయింది. రవి అతను కప్పుకున్న వస్త్రాన్ని సరిచేసి సెమ్మదిగా లేచి వెనక్కి తిరిగి నన్ను చూసి క్షణం నిర్ఘాంతపోయాడు. తర్వాత ఆప్యాయంగా భుజంమీద చెయ్యి వేసి నన్ను యటకి నడిపించుకు వెళ్ళేడు. సుమారొక అరమైలు దూరం నిశ్శబ్దంగా నడిచి వెళ్ళేం. దార్లో ఎన్నోసార్లు మాట్లాడదామని ప్రయత్నించేను. కాని గొంతుక విడలేదు. ఒక చెట్టుకింద బండమీద చతికిల పడ్డాం.

రవి నా కళ్ళల్లోకి చూస్తూ ఆ నిర్లక్ష్యపు నవ్వుతోనే "ఎప్పుడొచ్చేవు?" అన్నాడు. పొంగిపొంగి వొచ్చే దుఃఖాన్ని ఆపుకోలేకపోయాను. రవి మేనేజింగ్ డైరెక్టర్‌గానూ, నేను ఉద్యోగస్తుణ్ని గానూ ఉన్నప్పుడు, నాలో నేను, రవి నా కంటే ఏ యే విషయాల్లో గొప్పవాడో అంచనా వేసుకుని, ఆ స్థాయికి వెళ్లడానికి నేనూ ప్రయత్నించాలనుకునే వాణ్ని. కాని ఆ క్షణంలో అతని వొళ్లో తల దాచుకుని భోరున ఏడుస్తుండగా రవి ప్రేమతో నా వీపు నిమురుతూ



వుండగా గ్రహించేను అతని విశ్వరూపాన్నీ, నా అల్పత్వాన్నీ.

సుమారు రెండుగంటలు అక్కడే కూర్చున్నాం ఎన్నో విషయాలను గురించి నా చేత చెప్పించేడు. అదంతా కేవలం నన్ను సంతోషపెట్టడానికి దిగిన సంభాషణే కాని, రవికి అందులో ఏ అంశం మీదా ప్రత్యేకమైన ఆసక్తి కాని, ఆందోళన కాని, సంతోషంకాని కనబడలేదు. రవి మాటిచ్చే డనుకోడం, నేనూ వాణీ వెళ్ళి చేసుకోవడం, తర్వాత నేను డైరెక్టర్నవడం, వీటి పర్యవసానం— ఇవేవీ అతను ఊహించనివి కావు. నిజానికి అతను వేసిన చదరంగపు ఎత్తు ననుసరించే యాంత్రికంగా నేనూ వాణీ యీ గళ్ళల్లో నిలబడ్డామనిపించింది.

నేను బయలుదేరే ముందర రెండు వాగ్దానాలు చేయించుకున్నాడు. మొదటిది తను సజీవుడుగా వున్నట్టు వాణికి తెలియనివ్వద్దనీ, రెండోది నే నేవిధంగానూ తప్పుచేసినట్టు బాధపడొద్దనీ.

* * *

వాణి ఆరోగ్యం నేను కాశీ వెళ్ళక మునుపే అసంతృప్తిగా వుంది. తిరిగి వొచ్చిన వారం రోజుల్లో అకస్మాత్తుగా మరణించింది. చావు ఇంత దగ్గరలోనే వుందని వూహించలేకపోయాను. మార్ఫియా అలవాటుతో బాటు గుండె బలహీనత కూడా ఏర్పడ్డంవల్ల చావు మరింత తరుముకువచ్చింది.

వాణి మరణించిన వారంరోజులకి ఓ రోజు టెలిఫోన్‌లో రవి గొంతు వినబడి ఉలిక్కిపడ్డాను. తనుండేచోటు చెప్పి వెంటనే వచ్చి రహస్యంగా తనని కలుసుకోమన్నాడు. అరగంటలో వెళ్ళి కలుసుకున్నాను. రవిని చూడగానే నా దుఃఖం అంతా మరిచిపోయాను. సానుభూతి వాక్యాలతో ధైర్యం చెప్పి, వాణి దగ్గిర నుంచి నాలుగురోజులక్రితం తనకి వచ్చిన ఉత్తరం నా చేతిలో పెట్టేడు. కవర్ మీద వున్న ఎడ్రస్ చూశాను. "భిక్షూ రవికుమార్, (ఆంధ్ర) బౌద్ధ విహార్, సారనాథ్. బెనారస్ డిస్ట్." అనివుంది ఉత్తరం తీసేను. ముత్యాల్లాంటి అక్షరాలతో వాణి దస్తూరి ప్రత్యక్షమైంది.

రవీ,

ఈ వుత్తరం, ఆలస్యంగానైనా, ఏ భిక్షువు ద్వారానో నీ కందుతుందన్న ధైర్యంతో వ్రాస్తున్నాను. నేను కాశీ వచ్చినప్పుడు సారనాథ్‌లో రవి తీసిన ఫోటోలో నిన్ను ఆనవాలుపట్టేను. రవికీ విషయం తెలియదు. ఈ రాత్రే నిన్నూ రవినీ ఈ లోకాన్నీ విడిచిపెడుతున్నాను. నీలాగ ఈ లోకంలోనే అజ్ఞాతంగా జీవించగలిగే ఆత్మబలం నాకు లేదు.

నీ పాలిటి, మోసకత్తెనై నీ జీవిత పరమావధి కవరోధం కలిగించాను. భగవంతుడు దయామయుడు మళ్ళీ నీ మార్గం నీకు చూపెట్టేడు. మన వైవాహిక జీవితం ద్వారా, నీ మరణానికి నేనే కారణమన్న ఆలోచనతో ఇన్నాళ్ళూ దుర్భరమైన నరకాన్ననుభవించేను. నువ్వు సజీవుడవై నిరాఘాటంగా, నీ అన్వేషణ సాగిస్తున్నట్టు గ్రహించేక బ్రహ్మానందపడ్డాను. ఈ ఆనందంతోటే భగవన్నామస్మరణ చేసుకుంటూ ప్రాణం విడుస్తాను.

రవి ఎండమావుల్ని వెంటాడి వెంటాడి అలసిపోయిన దురదృష్టవంతుడు. జ్ఞానమున్న మూర్ఖుడు; బహుళాశా శాపగ్రస్తుడు. ఈ విశాల ప్రపంచంలో ఇక రవి ఒక ఏకాకి. రవి జీవితం సరిదిద్దమనడం నిన్ను అర్థించే రెండు కోరికల్లోనూ మొదటిది. మాకో ఆరేళ్ళ కొడుకున్నాడు. మనం పెరిగిన నాగరికతా వాతావరణంలో వాడు పెరగకూడదని నా ఆశయం. ఈ విషవలయంలోంచి తప్పించి దైవోన్ముఖంగా జీవితయాత్ర సాగించడానికి కావల్సిన విద్యాసాధనలు సమకూర్చమనడము నా రెండో కోరిక.

శాశ్వతముగా
నీ వాణి

మార్ఫిన్ ఓవర్ డోస్ వల్ల వాణి ఆత్మహత్య చేసుకుందని అప్పుడు గ్రహించేను. నిజానికి ఆ ఫొటో ప్రింట్స్ సంగతి పూర్తిగా మరిచిపోయాను. నేను లేనప్పుడు పోస్ట్‌లో వొచ్చివుంటాయి.

"నేను నీ మానసిక అశాంతిని భరించలేను. కుర్రాణ్ణి పబ్లిక్‌స్కూల్లో పెట్టి, అరవిందో ఆశ్రమంలో చేరదామనుకుంటున్నాను." అన్నాను.

"మనశ్శాంతికోసం అందరూ ఆశ్రమాల్లో చేరితే ఆశ్రమాలు పట్టణాలుగా మారి అశాంతి నిలయాలవుతాయి. నీ మనస్సునే ఒక పవిత్రమైన ఆశ్రమం చేసుకుని దాన్నే ఆశ్రయించు. కష్టసుఖాలకి అతీతమైన మనఃస్థితే శాంతి. సమాజంలో బాధ్యతగల పౌరుడిగా ధర్మబద్ధమైన మార్గంలో జీవించడమే మానవ జీవితానికి లక్ష్యం. అది సాధించడమే ఒక తపస్సు. ధైర్యంతో నీ లక్ష్యాన్ని సాధించు. నా సలహా పాటిస్తానని వాగ్దానం చెయ్యి." అన్న రవి మాటల్లో సందేశంకంటే ఆదేశం ధ్వనించింది. నిస్సహాయంగా రవి చేతిలో చెయ్యేసేను.

"పదార్థ విజ్ఞాన శాస్త్రంతో బాటు జీవితయాత్రకి అత్యంతావసరమైన ధర్మాచరణావిధానం నేర్పకుండా కేవలం పొట్టకూటికోసం రూపొందుతున్న విద్యావిధానమే ప్రపంచంలో ఈనాటి అశాంతికి కారణం. సర్వతోముఖమైన నూతన విద్యావిధానాన్ని విశ్వవ్యాప్తి చెయ్యడానికి ఈ మధ్యనే వేదపాఠశాల ప్రశాంతి నిలయంలో ప్రారంభింపబడింది. అందులోని ప్రతి విద్యార్థీ ఒక్కొక్క వివేకానందుడై సనాతన ధర్మ విజయధ్వజస్థాపన ద్వారా విశ్వశాంతికోసం సంసిద్ధుడవుతున్న కారణ జన్ముడనటంలో సందేహం లేదు."

"బాబు నందులో చేర్చుకుంటారా?" అన్నాను రవి ధోరణి గ్రహించి.

"నేను ఈ రోజే బాబా సన్నిధికి వెడుతున్నాను. ఆయన దయాసముద్రులు తప్పక చేర్చుకుంటారు మీకు త్వరలోనే కబురొస్తుంది," అన్నాడు రవి.

రవిపట్ల వుండే సంపూర్ణ విశ్వాసంతో 'సరే' నన్నాను.